క్లుప్తంగా

సత్సంగాలతో ఐక్యత పెంపొందుతుంది



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్: సత్సంగాలతో ఐక్యతా భావం పెంపొందుతుందని లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో శ్రీ లలితా సుందేశ్వర స్వామి సత్సంగం ఆధ్వర్యంలో మాతృమూర్తుల సత్సంగం ఒడిబియ్యం కార్యక్రమాలు జరిగాయి. మహిళలు ఒకరికొకరు ఒడిబియ్యం పెట్టుకున్నారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు.

సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం



సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభ కార్యక్రమంలో నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: సంస్కృత భారతి, గీతా మందిరం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దశదిన సంస్కృత సంభాషణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఓల్డ్‌సిటీలోని గీతా మందిరంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని శ్రీ సరస్వతి విద్యా పీఠం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. సంస్కృతం వ్యవహారిక భాషగా అతి సులభంగా మాట్లాడేందుకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. పది రోజుల శిబిరాన్ని వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. శిబిరం నిర్వాహకులు సుశ్రిత, తిమ్మయ్య ఆచారి పాల్గొన్నారు.

సాధనతో క్రీడల్లో రాణింపు



క్రీడాకారులతో డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణించాలంటే ప్రతి రోజు సాధన చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సమ్మర్ హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంపు క్రీడాకారులకు దాతలు శ్రీధర్ రెడ్డి, దాసెట్టి శ్రీనివాసులు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిక్షకులు చిన్న సుంకన్న పాల్గొన్నారు.

పెంచిన టోల్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దేశవ్యాప్తంగా పెంచిన టోల్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తి అవ్వగానే టోల్ చార్జీలను పెంచడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

శివ పార్వతుల కల్యాణంపై హరికథ



హరికథ వినిపిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద కె.ప్రమీల భాగవతారిణి, రాయచోటి వారిచే శివ పార్వతుల కల్యాణం హరికథ కార్యక్రమం నిర్వచించారు. కార్యక్రమములో హార్మోనియం సహకారాన్ని ఎం. మధుసూదన్, తబలా సహకారాన్ని ఎన్.బాబు రావు అందించారు.

లోటుపాట్లకు తావివ్వొద్దు

- పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియ
- మైక్రో అబ్జర్వర్లకు సూచించిన ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ





మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ చిత్రంలో కలెక్టర్ సృజన, శిక్షణ కార్యక్రమానికి హాజరైన మైక్రో అబ్జర్వర్లు

కర్నూలు(సెంట్రల్): కౌంటింగ్ ప్రక్రియలో లోటుపాట్లకు తావులేకుండా మైక్రో అబ్జర్వర్లు అన్ని విషయాలను నిశితంగా పరిశీలించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు జాఫర్, మీర్ తారిఖ్ అలీ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు–2024 కౌంటింగ్ నిర్వహణపై జనరల్ అబ్జర్వర్ల సమక్షంలో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కౌంటింగ్ ప్రక్రియలో జరిగే ప్రతి అంశంపై నిశిత పరిశీలన చేసి నోట్ చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది నమోదు చేసుకుంటున్న వివరాలను పరిశీలించి నోట్ చేసుకొని తరువాత ఏజెంట్లు, సిబ్బందితో నివేదికలతో సరిపోల్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ..జూన్ 2వ తేదీన కౌంటింగ్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించినట్లు చెప్పారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు ఒక్కో మైక్రో అబ్జర్వర్ ఉండడంతో పాటు జనరల్ అబ్జర్వర్ల ప్రతినిధులుగా కొంతమంది మైక్రో అబ్జర్వర్లను నియమించనున్నట్లు చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నిబంధనల మేరకు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్ని విషయాలను పరిశీలించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు గుర్తింపు కార్డులను కచ్చితంగా తీసుకెళ్లి చూపిస్తే అనుమతి ఇస్తారన్నారు. గుర్తింపు కార్డులను కలెక్టరేట్‌లో పొందాలని, 4వ తేదీన ఉదయం 5 గంటలకు కలెక్టరేట్ నుంచి బస్సుల్లో తరలించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. అనంతరం ఈవీఎం కౌంటింగ్, మైక్రో అబ్జర్వర్ల విధులపై ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి సిద్ధలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సోమశేఖరరెడ్డి వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్

కర్నూలు (సెంట్రల్) : సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మాట్లాడుతూ పోస్ట్ పోల్ సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ను ఓపెన్ చేయడానికి కార్పెంటర్, ఎలక్ట్రీషియన్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విధంగా సిబ్బందిని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు అవసరమైన బస్సులను నిర్దేశించిన సమయంలో కలెక్టరేట్ వద్ద ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, పాణ్యం రిటర్నింగ్ అధికారి/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి/మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి/సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, పత్తికొండ రిటర్నింగ్ అధికారి/ఆర్‌డీఓ రామలక్ష్మి, కోడుమూరు రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్, ఆలూరు రిటర్నింగ్ అధికారి రాము నాయక్, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, మెప్మా పీడీ నాగశివలీల, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

- కర్నూలు అసెంబ్లీ బరిలో 25 మంది
- ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, 19 రౌండ్లు
- పోలైన ఓట్లు 1,74, 973

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. గత నెల 13 వ తేదీన ఎన్నికల పోలింగ్ జరిగింది. ఫలితం కోసం అభ్యర్థులు 21 రోజులు నిరీక్షించారు. ఎట్టకేలకు మంగళవారం ఫలితాలు రానుండటంతో ఉత్కంఠకు తెరపడనుంది. కర్నూలు అసెంబ్లీ బరిలో అధికార, ప్రతిపక్ష పార్టీ, ఇండిపెండెంట్లతో కలుపుకుని మొత్తం 25 మంది బరిలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల మధ్య పోటీ జరిగింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో కౌటింగ్ ప్రారంభం కానుంది.

ఆర్‌యూలో ఓట్ల లెక్కింపు

కర్నూలు అసెంబ్లీకి సంబంధించి నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 10 రోజులుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పనుల్లో అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉంది. కర్నూలు అసెంబ్లీ నియోజవర్గానికి సంబంధించి ఆర్‌ఓతో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (మోహన్‌కుమార్), ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా అడిషనల్ కమిషనర్ (రామలింగేశ్వర్) డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి (పోస్టల్ బ్యాలెట్ ఇన్‌చార్జ్)లు వ్యవహరిస్తారు. అలాగే ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి పర్యవేక్షణ చేస్తారు. కాగా అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 19 రౌండ్లలో ఫలితం తేలనుంది. అరగంటకు ఒక రౌండ్ పూర్తి అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల మధ్య అధికారికంగా ఎవరు గెలిచారో ప్రకటిస్తారు.

పోలైన ఓట్లు 1,74,973

గత నెల 12 వ తేదీ నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో కర్నూలు అసెంబ్లీ పరిధిలో 1,74, 973 ఓట్లు పోలయ్యాయి. కర్నూలు అసెంబ్లీకి పోలింగ్ ముగిసే నాటికి 63.87 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లు 2,74, 465 ఉన్నాయి. పోలింగ్ రోజు 86, 259 పురుషులు 88,715 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సారి పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో నిబంధనలు తప్పనిసరి



ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి నియమించిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కర్నూలు అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బంది అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో చెల్లిన, చెల్లని బ్యాలెట్ ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలన్నారు. అభ్యర్థులకు పోలైన ఓట్లను సంబంధిత పత్రాల్లో నమోదు చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా అంకెలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను అనుమతించబోమని, ఒకవేళ తెచ్చుకుంటే వాటిని పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో భద్ర పరచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మెప్మా పీడీ నాగశివలీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో భద్ర పరచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.

దంచి కొట్టిన వర్షం

- కల్లూరు మండలంలో 65.6 మి.మీ వర్షపాతం నమోదు
- పొంగిన వాగులు, వంకలు
- ఆనందంలో రైతన్నలు



నెరవాడ పాత బ్రిడ్జిపై పొంగి ప్రవహిస్తున్న వర్షం నీరు

కల్లూరు: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు వర్షం దంచి కొట్టింది. గ్రామాల్లో వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పర్ల గ్రామంలో చిన్న వాగు, పెద్ద వాగు పొంగి ప్రవహించడంతో రాకపోకలు సాగించడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. నెరవాడ బ్రిడ్జిపై వక్కెర వాగు పొంగి ప్రవహించింది. నెరవాడ గ్రామ ప్రజలు ఇబ్బందులను చూసిన ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తోంది. కొద్ది రోజుల్లో బ్రిడ్జి పనులు పూర్తికానున్నాయి. ఇది పూర్తయితే వక్కెర వాగు ఎంత పొంగి ప్రవహించినా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రైతన్నల హర్షం

కొద్ది రోజులుగా ఎండ తీవ్రత పెరిగి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో నేల మురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. మూడు పదును వర్షం కురిసిందని రైతన్నలు ఆనందంలో ఉన్నారు. వారం, పదిరోజుల్లో ఖరీఫ్ పంటలు సాగు అయ్యే అవకాశం ఉంది. మండలంలో ఇప్పటికే బోర్ల కింద రెమడూరు, పుసులూరు, బొల్లవరం, ఇతర గ్రామాల్లో పంటల సాగు చేశారు. వర్షం కురవడం వల్ల పంటలకు జీవకళ వస్తుందని ఆయా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కురిసిన వర్షం వల్ల మెట్ట భూముల్లో కూడా విత్తనాలు విత్తడానికి రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలో 65.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో గత ఏడాది కంటే పంటసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించొద్దు

- బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందికి అడిషనల్ ఎస్పీలు దిశానిర్దేశం



ఓట్ల లెక్కింపు బందోబస్తు విధులకు వచ్చిన సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు

కర్నూలు : ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించొద్దని అడిషనల్ ఎస్పీలు నాగరాజు, నాగబాబు దిశా నిర్దేశం చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో సోమవారం స్థానిక పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బందోబస్తు విధుల్లో ఏమి చేయాలో, ఏమి చేయకూడదో నిర్దేశం చేస్తూ ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సిబ్బంది హెచ్చరించారు. రాయలసీమ యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న టూవీలర్ మొబైల్ పార్టీలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తు, చుట్టూ పహారా కాస్తున్న పెట్రోలింగ్ పార్టీలు, యూనివర్సిటీ వైపు అనుమతి లేనివారు రాకుండా ఆపేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, యూనివర్సిటీలోకి వచ్చి వెళ్లే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద తనిఖీ నిర్వహించే సిబ్బంది పకడ్బందీగా తమ విధులు నిర్వహించాలని సూచించారు.

ఆర్‌ఓ అనుమతి పత్రం తప్పనిసరి

కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లోకి రిటర్నింగ్ అధికారుల అనుమతి పత్రాలు లేకుంటే అనుమతించొద్దని అదనపు ఎస్పీలు సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు, ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, ఇతర అధికారులు, మీడియా ప్రతినిధులు నిర్దేశిత మార్గాల ద్వారానే కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి బాల్‌పెన్, పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మినహా ఏవీ కౌటింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయన్నారు. మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ బృందాలు, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు బందోబస్తు ఎలా నిర్వహించాలో సిబ్బంది ద్వారా తెలుసుకుని లోటుపాట్లు సర్దుబాటు చేసుకోవడానికి రిహార్సల్స్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేవరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని వారు సూచించారు. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది రాకపోకల రూట్ మ్యాప్‌పై విధుల్లో ఉండే పోలీసులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

పిల్లల పెరుగుదలలో తల్లిదండ్రుల శ్రద్ధ అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లల పెరుగుదల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, నిరంతరం పిల్లలను నిశితంగా గమనిస్తూ ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ క్లబ్ ఫుట్(వంకర పాదాలు) దినోత్సవంపై క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ వారు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లల్లోని అనేక లోపాల గురించి ఆందోళన చెందుతుంటారని చెప్పారు. వాటిలో కొన్నింటిని తాత్కాలికంగా నిర్లక్ష్యం చేస్తారన్నారు. చాలా మంది తల్లిదండ్రుల్లో చిన్నపిల్లల్లో వచ్చే సమస్యలపై అవగాహన లేకపోవడం వల్ల వాటిని ఆలస్యంగా గుర్తిస్తారన్నారు. చికిత్సలో జాప్యం వల్ల పిల్లలు విలువైన బాల్యాన్ని ఆనందంగా గడపలేకపోతారన్నారు. పుట్టుకతో వచ్చే ఈ సమస్యలను తొందరగా గుర్తిస్తే సర్జరీతో గానీ, సర్జరీ లేకుండా తగ్గించుకోవచ్చన్నారు. పిల్లలు నడుస్తున్నప్పుడు ఇబ్బంది పడటం, తరచుగా పడిపోవడం లేదా పరిగెత్తడంలో ఇబ్బంది ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ విజయానందబాబు మాట్లాడుతూ తల్లి గర్భంలో ఉన్నప్పుడు కాలు మెలిపడటం, లేదా సరైన ఒత్తిడికి గురికావడం, మద్యపానం, దూమపానం చేసిన లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నా పుట్టబోయే బిడ్డకు క్లబ్ ఫూట్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన లోపాలను సకాలంలో గుర్తించకపోతే పిల్లలు జీవితాంతం వైకల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. త్వరగా గుర్తించి నయం చేస్తే చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్ అందించగలుగుతామన్నారు. జిల్లాలో క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ వారు వంకర పాదాల పిల్లలకు ఉచితంగా వైద్యం అందిస్తారని, వారికి బూట్లు కూడా ఇస్తారని తెలిపారు. కర్నూలు హెల్ప్‌లైన్ 8800015588, 8800020503కు ఫోన్ చేసి అవసరమైన వారు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ పవన్, డైస్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సృజన, డాక్టర్ కీర్తన, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రవీణ, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, కేర్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ సమన్వయకర్త రేష్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే వైద్యపరీక్షలు



ఈసీజీ పరికరం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యపరీక్షలన్నీ న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాజువాలిటీ వద్ద రెండవ నెంబర్‌లో ఉన్న ఈసీజీ పరికరాన్ని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోకి తరలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యపరీక్షలన్నీ ఒకేచోట ఉండటం వల్ల రోగులు అటూఇటూ తిరిగే ప్రయాస తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఏఆర్‌ఎంవో డాక్టర్ వెంకటరమణ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ పాల్గొన్నారు.

పల్లకీలో ఆదిదంపతుల విహారం

మహానంది: ప్రసిద్ధ శైవక్షేత్రమైన మహానందిలో వెలిసిన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, ఆంజనేయశర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం పల్లకీలో కొలువు చేసి ఊరేగించారు.

నేడు నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానందిలో స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరుడి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరస్వామికి మంగళవారం ప్రదోషకాలంలో అభిషేకం, అర్చన పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ వైశాఖమాసం, బహుళ త్రయోదశిని పురస్కరించుకుని ప్రదోషకాలంలో సాయంత్రం ప్రత్యేక అభిషేక, అర్చనలు ఉంటాయన్నారు. భక్తులు అభిషేక, అర్చన పూజల్లో పాల్గొనాలని కోరారు. నందీశ్వరుడికి ప్రదోషకాలంలో అభిషేకం చేయడం ద్వారా తెలిసీ, తెలియక చేసిన దోషాలు తొలగిపోతాయని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం సాయంత్రం సెబ్ కార్యాలయ సెబ్ సీఐ భార్గవరెడ్డి వెల్లడించారు. మద్యం కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు శ్రీనివాసగౌడ్, భరత్, నరసింహరెడ్డి, రాధమ్మ, ఇందుమతి సోదాలు నిర్వహించారు. ఇంద్రానగర్‌కు చెందిన బోయ తిక్కస్వామి, జయరాం, ఆదర్శ విద్యాపీఠం వద్ద నివాసముంటున్న బోయ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా 576 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.